# కాలక్షేపం[1]

“కాంతం, అవునుకాని, నేను రోజు పొద్దుట 10 గంటలకి ఆఫీసు వెళ్లి, రాత్రి 7 గంటలకి ఇంటికి వస్తున్నాను. నేనింట్లో లేనప్పుడు నీకెలాగ ఉబుసు పోతోంది? నీవింట్లో ఏం చేస్తుంటావు?” అని ఒకరోజు మా ఆవిడని అడిగాను.

“దానికేంలెండి, మీరు ఆఫీసుకి వెళ్ళగానే, యింటిపన్లు సవరించుకొని, ఏవో రెండు పత్రికలు చదివేసి, కొంతసేపు నిద్రపోయి లేచానంటే, యింతల్లోకి సాయంత్రం 4 గంటలకు పైగా ఐపోతుంది. కాఫీ చేసివుంచేసి వంట వండేసరికి రాత్రి 7 గంటలైపోతుంది. అప్పటికి మీరు వచ్చేస్తారు,” అని సావధానంగా పలికింది.

కాని నాకు కాంతం మాటల్లో ఏమాత్రం నమ్మకం కలుగలేదు. అబ్బో, మాకాంతం ఏమిటి, పదిగంటలసేపు యెక్కడికి వెళ్ళక, యెవరితోనూ మాట్లాడకుండా ఉండడమేమిటి? అది అసలు నాతో ఎప్పుడూ ఏదో వాగుతూనే ఉంటుందికదా? ‘సరే, దీనిమాటల్లో ఎంతవరకు

[1] ఇది వింధియా తెలుగులో రాసిన ఒంటి కథ. ఇటీవల నేను తిరుచ్చి గ్రామంలో మా నాన్నగారు కాపురమున్న నివాసంకి వెళ్ళినప్పుడు ఇది నాకు అకస్మాత్తుగా దొరికింది. ఇది అక్కయ్య రాసిన మొట్టమొదటి రచన ఐవుండవచ్చును అని నా భావన. ఆమె రాసిన మొదటి తమిళ కథ **పార్వతి** ఆగస్ట్ 15, 1947 సంవత్సరం **కలైమగళ్** పత్రికలో వెలుబడింది: సుందరేశన్

కల్లనిజములు కలిసియున్నాయో తెలుసుకోవాలి,' అని నా మనసులో నిశ్చయించుకున్నాను.

ఆ రోజు ఆఫీసునుంచి యింటికి వేగంగానే వచ్చేసాను. రోజూ నేను 5 గంటలకి ఆఫీసు వదలగానే ఏ బీచికో, పార్కుకో, స్నేహితుల ఇళ్ళకో వెళ్ళి రాత్రి 7 గంటలకి ఇంటికి వస్తూవుంటాను. కాని ఆవేళ మాత్రం కాంతం సంగతి తెలుసుకోవాలని, మరెక్కడకీ వెళ్ళకుండా, ఆఫీసునుంచి తిన్నగా యింటికే వచ్చేసాను. నేననుకున్నట్లే కాంతం ఎక్కడికో బయలుదేడానికి డ్రెస్సయి, తయారుగా ఉంది.

నన్నుచూడగానే "ఏమండోయ్, మీరివాళ ఇంటికి వేగంగా దయచేసారే?" అని నవ్వుతూ వెటకారంగా అంది. "లేదు, కాంతం, ఇవాళ జోరుగా తలనొప్పి వేసింది; ఆఫీసులో సెలవు తీసుకొని వచ్చేసాను," అని అన్నాను.

"సరేలెండి . . వంటింట్లో ఫ్లాస్కులో కాఫీ పోసిపెట్టాను. నేను కమలా వాళ్ళింటికి వెళ్ళివస్తాను," అని అంటూ కాంతం గబ గబా తన గదిలోకి వెళ్ళింది.

నేను కాఫీ తాగేసి, హాలులోకివచ్చి, మేజావద్ద నిల్చుని ఉన్నాను. కాంతం తన గదిలో, అద్దానికెదురుగా నిలబడి మొహంకి పవుడరు అద్దుకుంటోంది. కొంతసేపటికి "ఏమండీ, మీరుగాని ఎక్కడైనా నా సిల్కు hand kerchief చూసారా?" అని అడుగుతూ గదిలోనించి హాలుకి వచ్చింది.

"అబ్బే, నాకేంతెలుసునే నీ రుమాలు గురించి? నేనెక్కడా చూడలేదు . . . ఇప్పుడేగా ఇంటికి వచ్చాను?" అని అన్నాను.

"అయ్యో, సరికొత్త రుమాలండీ! నిన్ననే కొన్నాను. ఎంతో అందంగానూ, ఫేషణబుల్ గా కనిపించింది. ఇవాళే పైకితీసాను. నిష్కారణం, ఎక్కడో మంచి రుమాలు పోయింది," అని గొణుక్కుంటూ గదిలో వెదకడం మొదలుబెట్టింది.

"ఛీ, ఛీ, ఎందుకలా గాబరా పడతావ్? ఎక్కడ పోతుంది నీ రుమాలు? ఇక్కడే ఎక్కడైనా ఉంటుందిలే . . . నెమ్మదిగా వెతకితేనే దొరుకుతుంది."

కాంతం మళ్ళీ హాలు, వంటిల్లు, తన గది, ఏ ఒక్కచోటా మిగలకుండా, జల్లెడ వేసినట్లు వెదికింది. కాని, ఊహూం, ఆ రుమాలెక్కడైనా దొరుకుతేగా?

"అయితే, కాంతం, యివాళ మధ్యాహ్నం యెక్కడికైనా, యెవరింటికైనా వెళ్ళావేమో? అప్పుడు నీ దగ్గర రుమాలు ఉందో లేదో బాగా జ్ఞాపకం తెచ్చుకో!" అన్నాను.

వెంటనే కాంతం ఇలా గొణగడం ప్రారంభించింది: "అబ్బే, అప్పుడంతా నా దగ్గరనే అది జాగ్రత్తగావున్న జ్ఞాపకముంది. మొదట లక్ష్మీకాంతం ఇంటికి వెళ్ళినప్పుడు నా మొల్లో దోపుకొని ఉన్నాను. తోవలో, ఆ రుమాలుతో మొహం తుడుచుకున్నానుకూడాను. ఆ తరువాత వాళ్ళింటినుంచి మిస్సెస్ శంకరంగారింటికి వెళ్ళాను. ఆవిడకూడా నా

రుమాలు చూసి, 'ఎక్కడ కొన్నావమ్మా యిది, చాలా బాగుందే?'' అని అడిగారు. అక్కడనుంచి white shop కి వెళ్ళి రెండు జాకెట్టు గుడ్డలు ఐదు రూపాయలకి కొన్నాను. షాప్ వాడుకూడా రుమాలుచూసి, 'అమ్మగారూ, నిన్నయిక్కడ కొన్న రుమాలు బాగుందా?' అని అడిగాడు. అక్కడనుంచి నిన్న బేసరీకి ఆర్డరిచ్చినవాడి దగ్గరకి వెళ్ళి 'బేసరి తయారయిందా?' అని అడిగాను. వాడు ఇంకా రెండు రోజులతరువాత రమ్మన్నాడు. సరే అని మిస్ కలావతి ఇంటికి వెళ్తే, ఆమెకూడా నా రుమాలుచూసి చాలా ఫేషణబుల్ గా వుందని చెప్పింది. ఇంటికి వస్తూండగా నా కళ్ళో ధూళి పడ్డాది. అదికూడా రుమాలుతో తుడుచుకున్నాను. ఇంటికి వచ్చినదాకా వుందికదా, మరి ఎక్కడకి పోయుంటుంది చెప్మా? . . . అయ్యో, కర్మం . . . సరికొత్త రుమాలు నిష్కారణంగా పోయింది! . . . నాకు తల్చుకుంటే ఇంతా అంత దుఃఖంకాదు . . . అలాగుంది నా సంగతి . . .'' అని నొచ్చుకుంది.

నేను నవ్వుకున్నాను. ''ఐతే అది ఎక్కడికో రెక్కలు కట్టుకొని ఎగిరిపోయుంటుందా ఏమిటి? సరే, నువ్వుకూడా రెక్కలంటించుకొని, దాన్ని వెంటబెట్టు,'' అని నవ్వుతూ అన్నాను.

''అబ్బ, పోనిద్దురూ, మీకు హాస్యంగా, నవ్వుగా వుంది - నేనిలా ఏడుస్తూవుంటే . . . '' అని అంది కాంతం సగం నవ్వుతూనూ, సగం ఏడుస్తూనూ.

“ఐతే, కాంతం, ఇక్కడేవుండు, నేను వెళ్ళి వెతుకుతాను,” అని వంటింట్లోకి పోయి, ఆ రుమాలుని చేత్తో పట్టుకొని హాలుకి వచ్చాను. కాంతం, సంతోషంతో నా చేతుల్లోనుంచి దాన్ని లాగ్గుంది.

“చూసావా కాంతం, నేనెంత వేగం వెతకితెచ్చానో? నీకు వెతకడం చేతకాదు. కాని పోగొట్టుకొని ఏడవడంమాత్రం బాగా తెలుసు.”

“ఐతే అది ఎక్కడ వున్నండీ?”

“అదుగో, వంటగదిలో ఆ స్టాండుపక్కనే వుంది. వెళ్ళగానే అగుపడ్డాది. తీసుకువచ్చాను.”

“నేను వెతికినప్పుడు అక్కడ లేనేలేదే . . .?”

“వహ్వా! అంత చక్కగా కళ్ళుపెట్టుకొని చూసావన్నమాట!”

కాంతం నవ్వి ఊరుకుంది.

“కాంతం, నేనాఫీసుకి పోయినప్పుడు నీకెలా ఉబుసు పోతుందని నాకు ఇప్పుడు బాగా తెలిసింది. నేనడిగినప్పుడు వంటన్నావ్ . . . జ్ఞాపకం తెచ్చుకో . . . అమ్మోయ్, నువ్వెంత చలాకీదానివి! . . . నేను నీ మాటల్లో నిజమెంతవరకున్నదో తెలుసుకోవాలనే ఈ రుమాలు దాచాను . . . ” అని అన్నాను.

ఏమీ అనకుండా కాంతం గిర్రున తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయింది.

పాఠకులారా! చూసారా, మా కాంతం నేనాఫీసుకి వెళ్ళినప్పుడు ఎలా కాలక్షేపం చేస్తుందో?

********